ఒక్కరికే వందనం..!

- జీవో విడుదల చేసిన ప్రభుత్వం
- తల్లడిల్లుతున్న తల్లులు



బంగారు భవితకు బాటలు వేసుకునేందుకు కోట ఆశలతో పరీక్షలకు హాజరైన విద్యార్థులు

తుని: నేటి బాలలే రేపటి రేపటి పౌరులు... రాష్ట్ర ప్రగతికి మెట్లు... మాకు అవకాశం ఇస్తే ఇంట్లో ఎంతమంది పిల్లలు ఉంటే అందరికీ తల్లికి వందనం పథకం కింద రూ.15 వేలు ఇచ్చి ఆదుకుంటామని కూటమి నేతలు ఎన్నికల సమయంలో హామీలు ఇచ్చారు. ఈ హామీని నమ్మి పిల్లల తల్లులు ఓట్లేశారు. కొత్త ప్రభుత్వం ఏర్పడిన వెంటనే ఉత్తర్వులు వస్తాయని ఆశించిన తల్లులు ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థల్లో తమ పిల్లలను చేర్పించారు. తమ దగ్గర ఉన్న కొద్ది సొమ్ము చెల్లించి అడ్మిషన్లు తీసుకున్నారు. తల్లికి వందనం పథకం వస్తుందన్న ధీమాతో ఉన్నారు.

ప్రభుత్వ జీవోతో...

తల్లికి వందనం పథకం అమలుకు సంబంధించి ప్రభుత్వం జీవో విడుదల చేసింది. కుటుంబంలో ఒక్కరికి మాత్రమే వస్తుందని చావు కబురు చల్లగా చెప్పడంతో పిల్లల భవిష్యత్ కోసం కలలు కన్న తల్లులు చిన్నబోయారు. ప్రభుత్వం ఒక్కరికే అమ్మకు వందనం వస్తుందని తెలిసిన ప్రైవేటు విద్యాసంస్థల యాజమాన్యాలు ఫీజు చెల్లించాలని తల్లులపై ఒత్తిడి తీసుకువస్తున్నాయి. దీంతో వేలాది మంది విద్యార్థుల జీవితాలు త్రిశంకు స్వర్గంలో పడ్డాయి. గత ప్రభుత్వ హయాంలో విద్యాసంస్థలు తెరిచిన తక్కువ సమయంలోనే తల్లుల ఖాతాలో అమ్మఒడి పేరిట రూ.15 వేలు జమ చేసింది. ఐదేళ్ల పాటు విద్యార్థుల చదువులకు ఏ విధమైన ఇబ్బందులు లేకుండా ఉంది. ఎన్నికల సమయంలో సూపర్ సిక్స్‌లో భాగంగా అమ్మఒడికి బదులుగా తల్లికి వందనం పథకాన్ని కూటమి ప్రభుత్వం మ్యానిఫెస్టోలో పెట్టింది. ఆర్థికంగా సతమతం అవుతున్న పేదలు తమ పిల్లలకు బంగారు భవిష్యత్ ఉంటుందని భావించారు. అధికారంలోకి వచ్చిన వెంటనే ముఖ్యమంత్రి ప్రకటన చేస్తారని ఆశించారు. ఇందుకు భిన్నంగా నెల రోజుల సమయం తీసుకుని ఒక్కరికే తల్లికి వందనం ఇస్తామని చెప్పడంతో తల్లులు హృదయాలు తల్లడిల్లుతున్నాయి. ఎన్నికల సమయంలో ఇచ్చిన మాటను నిలబెట్టుకుని అందరికీ పథకాన్ని వర్తింప చేయాలని తల్లులు కోరుతున్నారు.

తల్లికి వందనం అమలు గాలికి...

ఏలేశ్వరం: ఏరుదాటే వరకూ ఓడమల్లన్న, ఏరుదాటాక బోడిమల్లన్న అనే రీతిలో కూటమి నేతల పాలన ఉంది. సార్వత్రిక ఎన్నికల్లో ఇచ్చిన హామీని కూటమి ప్రభుత్వం గాలికి వదిలేసింది. గత ప్రభుత్వం అమలు చేసిన అమ్మఒడి పథకంలో ఒక విద్యార్థికి రూ.15 వేలు ఇచ్చేవారు. అదే పథకానికి తల్లికి వందనం అని పేరుమార్చి కుటుంబంలో ఎంతమంది ఉన్న అందరికీ రూ.15 వేల చొప్పున ఇస్తామని ఎన్నికలకు ముందు కూటమి నేతలు ప్రకటించారు. అధికారంలోకి వచ్చాక ఆ హామీని గాలికి వదిలేయడంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గత ప్రభుత్వం నియోజకవర్గంలో నాలుగేళ్లలో 108263 మంది విద్యార్థులకు రూ.171,76,57,600 సొమ్ము అందజేసింది. ప్రతి విద్యార్థికి పథకం అందడమే ధ్యేయంగా గత ప్రభుత్వం పని చేసింది. కాగా ప్రస్తుత ప్రభుత్వం హాజరుతో పాటు పలు ఆంక్షలు విధిస్తూ తల్లులకు అన్యాయం చేసేందుకు సిద్ధమవ్వడంతో తల్లులు నిరసన వ్యక్తం చేస్తున్నారు.

మాట మారుస్తున్నారు



ఎన్నికల సమయంలో కూటమి నేతలు తల్లికి వందనం పేరిట ఇంట్లో ఎంత మంది పిల్లలు ఉంటే అంత మందికీ ఒక్కొక్కరికి రూ.15 వేలు ఇస్తామని హామీ ఇచ్చారు. అధికారంలో వచ్చాక ఇప్పుడు ఒక్కరికే ఇస్తామని మాట మారుస్తున్నారు. నాకు ముగ్గురు పిల్లలు. వాళ్లంతా ప్రభుత్వ పాఠశాలల్లోనే చదువుతున్నారు. ముగ్గురికీ పథకం వర్తిస్తే మాకు మేలు జరుగుతుంది.

– యెదల చంద్ర, విద్యార్థి తల్లి, నీలాద్రిరావుపేట, గండేపల్లి మండలం

ఎన్నికల్లో ఇచ్చిన హామీ నిలబెట్టుకోవాలి



ఎన్నికల్లో ఇచ్చిన హామీని కూటమి ప్రభుత్వం నిలబెట్టుకోవాలి. ఇటీవల జరిగిన ఎన్నికల్లో తల్లికి వందనం పథకం కింద కుటుంబంలో ఎంత మంది ఉంటే అంత మంది విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.15 వేలు చొప్పున ఇస్తామని కూటమి నేతలు హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చాక ఇప్పుడు కుటుంబంలో ఒక్కరికే ఇస్తామని చెబుతున్నారు. ఇది ముమ్మాటికీ ప్రజలను మోసం చేయడమే. ఇచ్చిన హామీ నెరవేర్చి మాట నిలుపుకోవాలి.

– సిరిపరపు మణిమాల, విద్యార్థితల్లి, ఏలేశ్వరం

పిల్లల అవసరాలకు ఇబ్బంది ఉండేది కాదు



నా ఇద్దరు పిల్లలు ప్రభుత్వ బడిలో చదువుతున్నారు. గతంలో బడులు తెరిచే నాటికే అమ్మఒడి అందేది. పిల్లల పుస్తకాలు, బట్టలు, ఇతర అవసరాలకు పెద్ద ఇబ్బంది ఉండేది కాదు. ఎన్నికల ముందు కూటమి నాయకులు ఎంతమంది పిల్లలుంటే అంతమందికి అమ్మకు వందనం ఇస్తానన్నారు. ఇప్పటి వరకూ ఆ ఊసే లేదు. పిల్లల స్కూల్ అవసరాలు తీర్చడానికి ఇబ్బంది పడుతున్నాం. ప్రభుత్వం ఎన్నికల ముందు చెప్పింది ఒక్కటి. ఇప్పుడు చేసేది మరొకటిగా ఉంది. ఇది చాలా అన్యాయం. ప్రభుత్వం పిల్లల ఇబ్బందులు గుర్తించాలి.

– గుడివాడ వరలక్ష్మి, విద్యార్థి తల్లి, ఇందుగపల్లి, కోటనందూరు మండలం

మాజీ సీఎం జగన్‌ను కలసిన దాడిశెట్టి రాజా



మాజీ సీఎం జగన్‌ను కలసిన మాజీ మంత్రి దాడిశెట్టి రాజా

తుని రూరల్: మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని గురువారం మాజీ మంత్రి దాడిశెట్టి రాజా మర్యాదపూర్వకంగా కలిశారు. మాజీ మంత్రి దాడిశెట్టి రాజా తాడేపల్లిలో వైఎస్ జగన్‌ను కలిసి తుని నియోజకవర్గంలో రాజకీయ పరిస్థితులను వివరించారు. సమస్యలపై పోరాటం చేస్తూ ప్రజలకు అండగా నిలవాలని జగన్‌మోహన్‌రెడ్డి సూచించినట్టు రాజా తెలిపారు. ఆయన వెంట తొండంగి మండల పరిషత్ ఉపాధ్యక్షుడు నాగం గంగబాబు ఉన్నారు.

దేవస్థానం భూములకు కౌలు వేలం ఖరారు

ప్రత్తిపాడు: మండలంలోని ధర్మవరం గ్రామంలోని వేంచేసిన రాజగోపాలస్వామి, విశ్వేశ్వరస్వామి వార్ల దేవస్థానం భూములకు పెద్దాపురం మహారాణి సత్రం ఆవరణలో దేవదాయశాఖ తనిఖీ అధికారి చల్లా ఉదయ్‌కుమార్ బాబు సమక్షంలో గురువారం టెండర్ కం బహిరంగ వేలం నిర్వహించారు. ఈ వేలంలో సుమారు రూ.11 లక్షల ఆదాయం సమకూరిందని ఆలయ ఈఓ టీవీ సూర్యనారాయణ ఓ ప్రకటనలో తెలిపారు. ధర్మవరంలో రాజగోపాలస్వామి వారి దేవస్థానానికి చెందిన 48.68 ఎకరాల భూమికి, ధర్మవరం గ్రామ శివారున గల విశ్వేశ్వర స్వామి వారి దేవస్థానానికి చెందిన 21 ఎకరాల భూమికి మూడేళ్ల కాలానికి గాను ఈ ఆదాయం వచ్చిందన్నారు. గతంలో అత్యధికంగా రూ.5 లక్షలకే పాడుకున్నారని, ఈసారి అత్యధికంగా వేలం కొనసాగడంతో దేవస్థానానికి రూ.6 లక్షల ఆదాయం అదనంగా సమకూరిందని ఈఓ వివరించారు.

క్లుప్తంగా

సరస్వతీ శిశుమందిర్ నూతన భవనం ప్రారంభం



యర్రవరంలో శిశుమందిర్‌లో పూజలు చేస్తున్న దాతలు

ఏలేశ్వరం: మండలంలోని యర్రవరంలో దాతల సహకారంతో నిర్మించిన సరస్వతీ శిశుమందిర్ నూతన భవనాన్ని గురువారం ప్రారంభించారు. హైదరాబాద్‌కు చెందిన మిథానీ కంపెనీ ఆర్థిక సహాయంతో భవనం నిర్మించారు. కంపెనీ ప్రతినిధులు గౌరీశంకర్, హరికృష్ణ, భారతీయ విద్యాకేంద్రం ప్రతినిధి చక్రపాణి భవనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా దాతలు మాట్లాడుతూ విద్యార్థులకు సంప్రదాయ విద్య అందిస్తున్న సరస్వతీ శిశుమందిర్‌కు నూతన భవనాన్ని నిర్మించడం ఆనందంగా ఉందన్నారు. తొలుత విద్యార్థులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో చెరుకూరి సత్యనారాయణ, సింగిలిదేవి సత్తిరాజు, బీశెట్టి పరదేశి, తోట వీరమహేశ్వరరావు, శివపార్వతి, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

గోసంరక్షణ ట్రస్టుకు విరాళం



దాత రామ్మోహన్‌కు రసీదు అందిస్తున్న సూపరింటెండెంట్ మూర్తి

అన్నవరం: రత్నగిరిపై సత్యదేవుని గోసంరక్షణ ట్రస్ట్‌కు బెంగళూరుకు చెందిన ఐ రామ్మోహన్, రమాసుందరి దంపతులు రూ. 50 వేలు విరాళాన్ని శుక్రవారం సమర్పించారు. ఈ మేరకు దాతకు రసీదును అన్నదానం సూపరింటెండెంట్ కంచి మూర్తి అందచేశారు.

పాఠశాలకు ఫ్యాన్లు బహూకరణ



జగ్గంపేట హైస్కూల్‌కు ఫ్యాన్లు బహూకరించిన పూర్వ విద్యార్థులు

జగ్గంపేట: స్థానిక ప్రభుత్వోన్నత పాఠశాలకు పూర్వ విద్యార్థులు సీలింగ్ ఫ్యాన్లు బహూకరించారు. పాఠశాలకు చెందిన 1992–93 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు గురువారం 20 సీలింగ్ ఫ్యాన్లను పాఠశాల హెచ్‌ఎం టీవీఎస్ రంగారావుకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తాము చదువుకున్న పాఠశాలలో నేడు విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులు ఉక్కబోతతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. వారి సౌకర్యార్థం 20 ఫ్యాన్లు కొనుగోలు చేసి స్కూల్‌కు అందజేసినట్టు తెలిపారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రత్తిపాడులో వర్షం



ప్రత్తిపాడులో గొడుగు సాయంతో స్కూల్‌కు వెళుతున్న విద్యార్థినులు

ప్రత్తిపాడు: మండల వ్యాప్తంగా గురువారం తెల్లవారుజాము నుంచి వర్షం కురిసింది. చిన్న చిన్న చినుకులతో మొదలై సుమారు రెండు గంటల పాటు వర్షం పడింది. ప్రత్తిపాడులో ఉదయం 2.8 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. ఈ వర్షం ఖరీఫ్ సాగుకు మేలు చేస్తుందని రైతులు చెబుతున్నారు. ప్రత్తిపాడు, టి.రాయవరం, చినశంకర్లపూడి తదితర గ్రామాల్లో రైతులు దుక్కులు ప్రారంభించారు.

4,600 లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం



లచ్చిరెడ్డిపాలెంలో బెల్లపు ఊటను ధ్వంసం చేస్తున్న ఎక్సైజ్ సిబ్బంది

రౌతులపూడి: మండలంలోని లచ్చిరెడ్డిపాలెంలో సారా బట్టీలపై గురువారం ఎక్సైజ్ అధికారులు దాడి చేశారు. జిల్లా స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (ఎస్ఈబీ) ఆదేశాల మేరకు తుని ఎక్సైజ్ ఎస్సై పి.చిట్టిబాబు తన సిబ్బందితో దాడి చేశారు. ఈ దాడిలో సారా తయారీకి సిద్ధం చేసిన 4,600 లీటర్ల పులిసిన బెల్లపు ఊటను ధ్వంసం చేశారు. గ్రామాల్లో ఎవరైనా అక్రమంగా సారా తయారు చేసినా, విక్రయించినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

మహిళా సాధికారతే లక్ష్యం



శాంతిఆశ్రమంలో అవగాహన ర్యాలీ చేస్తున్న ఐసీడీఎస్ సిబ్బంది



ఏలేశ్వరంలో ర్యాలీ చేస్తున్న అంగన్‌వాడీలు



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారి లక్ష్మి

- ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వరలక్ష్మి
- పలు గ్రామాల్లో మహిళలకు చట్టాలపై అవగాహన

ప్రత్తిపాడు రూరల్: ప్రత్తిపాడు రూరల్: మహిళా సాధికారతే ప్రధానమంత్రి మాతృత్వ యోజన పథకం లక్ష్యమని ప్రత్తిపాడు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎస్.వరలక్ష్మి అన్నారు. ఐసీడీఎస్, వైద్యారోగ్యశాఖ, పోలీసు శాఖల సమన్వయంతో గురువారం మండలంలోని శాంతిఆశ్రమంలో మిషన్ శక్తిలో భాగంగా మహిళలు, గర్భిణులకు చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీడీపీఓ వరలక్ష్మి మాట్లాడుతూ గర్భిణులకు ప్రభుత్వం ఆర్థిక సహాయం అందిస్తుందన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాలు జరిగేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వైద్యాధికారి మురళీమోహన్‌రెడ్డి, ఏఎన్‌ఎంలు, అంగన్వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

మహిళలు, బాలల చట్టాలపై అవగాహన

ప్రత్తిపాడు: గర్భస్థ శిశువులను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందని ప్రత్తిపాడు ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారిణి ఆర్‌వీఎస్ లక్ష్మి అన్నారు. ఐసీడీఎస్, వైద్య ఆరోగ్యశాఖ, పోలీసు శాఖల సమన్వయంతో గర్భస్థ శిశు లింగ నిర్ధారణ చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని ఆమె కోరారు. మిషన్ శక్తి కార్యక్రమంలో భాగంగా స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో గురువారం మహిళలు, బాలల చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మి మాట్లాడుతూ గుర్తింపు పొందిన స్కానింగ్ సెంటర్లలో అల్ట్రా సౌండ్ వైద్య పరీక్షలను లింగ నిర్ధారణకు ఉపయోగించడం చట్టరీత్యా నేరమన్నారు. నిర్ధారణ పరీక్షలు నిర్వహించే స్కానింగ్ సెంటర్లపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రాచపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు గీతా సుధ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా మహిళలకు సాధికారిత కల్పించడమే ప్రధాన మంత్రి మాతృత్వయోజన లక్ష్యమన్నారు. గర్భిణులకు ఈ పథకం కింద ప్రభుత్వం ఆర్థిక సహాయం అందిస్తోందన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాలు జరిగేలా చర్యలు తీసుకోవడంతో పాటు ఏఎన్‌సీ రిజిస్ట్రేషన్లు నమోదయ్యేలా చూడడం, నవజాత శిశువుల సంరక్షణ, వ్యాధుల నివారణలకు రూ.5 వేల ఆర్థిక సహాయం అందిస్తుందని వివరించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అరుణ, అంగన్‌వాడీ, పోలీసు, వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది, తల్లులు, బాలికలు పాల్గొన్నారు.

మహిళలు, బాలికల చట్టాలపై అవగాహన ర్యాలీ

ఏలేశ్వరం: మండలంలోని ఏలేశ్వరం, లింగంపర్తి గ్రామాల్లో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో గురువారం మహిళలు, బాలికల చట్టాలపై అవగాహన ర్యాలీలు నిర్వహించారు. అంగన్‌వాడీ సిబ్బంది ఆధ్వర్యంలో ర్యాలీలు చేసి పలు చట్టాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సూర్యకుమారి మాట్లాడుతూ మహిళలు, బాలికల చట్టాలపై అవగాహన కల్పించేందుకు 100 రోజులు కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధి కమిటీ ఏర్పాటు



ఆంధ్రా భద్రాద్రి ఆలయ నూతన అభివృద్ధి కమిటీ సభ్యులు

ప్రత్తిపాడు: స్థానిక నరేంద్రగిరిపై సుమారు రూ.3 కోట్ల అంచనా వ్యయంతో నిర్మిస్తున్న శ్రీరామనామ క్షేత్రం–ఆంధ్రా భద్రాద్రి ఆలయానికి నూతన అభివృద్ధి కమిటీని ఏర్పాటు చేసినట్టు శ్రీమద్ రామాయణ పీఠం వ్యవస్థాపక అధ్యక్షుడు రామకోటి సుబ్బారావు గురువారం ప్రకటించారు. ఈ కమిటీకి గౌరవాధ్యక్షుడిగా తేజోమూర్తుల సుబ్రహ్మణ్య శర్మ, అధ్యక్షుడిగా గోగుల వెంకటేశ్వరరావు, కార్యదర్శిగా కొల్లా రాంబాబులను ఏకగ్రీవంగా ఎంపిక చేసినట్టు ఆయన వెల్లడించారు. నూతనంగా ఎన్నికైన ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులను శ్రీరామనామ క్షేత్రం సభ్యులు సత్కరించారు. కార్యక్రమంలో గ్రామ ఉప సర్పంచ్ మదినే నూకరాజు, మాజీ సొసైటీ అధ్యక్షుడు జువ్వల చినబాబు, రెడ్నం రాజా, పుప్పాల రమణ, పత్రి రమణ, కొట్టేటి వీర అప్పారావు, మేడిబోయిన చంద్ర శేఖర్‌లతో పాటు 20 మంది సభ్యులు పాల్గొన్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు



కత్తిపూడి వాహనాలను తనిఖీ చేస్తున్న ఎంవీఐ శ్రీనువాస్

శంఖవరం: వాహనదారులు నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని కత్తిపూడి మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ పి.శ్రీనువాస్ హెచ్చరించారు. మండలంలోని కత్తిపూడి, అన్నవరం గ్రామాల్లో గురువారం ఆయన వాహనాల తనిఖీ నిర్వహించారు. నిబంధనలు అతిక్రమించిన వాహనాలను తనిఖీ చేసి జరిమానా విధించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కత్తిపూడి హైవేపై నిబంధనలకు విరుద్ధంగా తిరుగుతున్న టాటా మ్యాజిక్ వాహనాన్ని అదుపులోకి తీసుకుని రూ.1.50 వేలు అపరాధ రుసుం విధించామన్నారు. అలాగే అన్నవరంలో హైవేపై నిబంధనలకు విరుద్ధంగా తిరుగుతున్న వాహనాన్ని అదుపులోకి తీసుకుని రూ.50 వేలు జరిమానా విధించినట్టు తెలిపారు. ట్రిప్పర్లపై 4 కేసులు నమోదు చేశామన్నారు. భద్రతా నియమాలు పాటించని వాహనాలపై 6 కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. వాహనదారులు తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు.

వేతన సంఘాన్ని నియమించాలి

- కోవిడ్ కాలంలో నిలిపివేసిన డీఏ విడుదల చేయాలి
- నూతన పెన్షన్ విధానాన్ని వ్యతిరేకిస్తూ రైల్వే ఉద్యోగుల ధర్నా



ధర్నా చేస్తున్న రైల్వే ఉద్యోగులు

సామర్లకోట: రైల్వే ఉద్యోగులకు అమలు చేస్తున్న నూతన పెన్షన్ విధానాన్ని రద్దు చేయాలని, పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేస్తూ రైల్వే ఉద్యోగులు గురువారం ధర్నా చేశారు. రైల్వే ఎంప్లాయీస్ సంఘ్ ఆధ్వర్యంలో స్థానిక రైల్వే సీనియర్ సెక్షన్ ఇంజినీరు కార్యాలయం వద్ద ధర్నా చేశారు. పెన్షన్ ప్రతి కార్మికుని హక్కు అని దాని కోసం కార్మికులందరూ ఐక్యంగా పోరాడాలని యూనియన్ ప్రధాన కార్యదర్శి ఎం రమేష్ పిలుపునిచ్చారు. 8వ వేతన కమిషన్ వెంటనే నియమించాలని డిమాండ్ చేశారు. కోవిడ్ సమయంలో నిలిపివేసిన డీఏ బకాయిలను విడుదల చేయాలని, రైల్వే ఉద్యోగుల న్యాయబద్ధమైన కోర్కెలను అమలు చేయాలని, పాత పెన్షన్ విధానం అమలు చేయాలని నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో సంఘ చైర్మన్ ఈశ్వరరావు, వర్కింగ్ చైర్మన్ రామకృష్ణ, అసిస్టెంట్ సెక్రటరీ విశ్వప్రసాద్, వైస్ చైర్మన్ గోపాలరెడ్డి, కార్యవర్గ సభ్యులు, రైల్వే ఉద్యోగులు, మాజీ కార్యదర్శి కేవీ వెంకటేశ్వరరావు, సీనియర్ సెక్షన్ ఇంజినీర్ రామసుబ్బారావు పాల్గొన్నారు.

వసతుల కల్పనపై ప్రత్యేక దృష్టి



సమావేశంలో మాట్లాడుతున్న డీఈఓ రమేష్

- జిల్లా విద్యాశాఖాధికారి రమేష్

పెద్దాపురం: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల వసతుల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా విద్యాశాఖాధికారి పి.రమేష్ అన్నారు. స్థానిక శ్రీ ప్రకాష్ సినర్జీ పాఠశాలలో గురువారం జిల్లాలోని మండల విద్యాశాఖాధికారులు, ఆయా పాఠశాలల హెచ్‌ఎంలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈఓ రమేష్ మాట్లాడుతూ ఫేజ్–2 ద్వారా ఆయా పాఠశాలలకు మౌలిక వసతుల కల్పనకు చర్యలు చేపట్టామన్నారు. విద్యాశాఖాధికారులు, ప్రధానోపాధ్యాయులు రెండు రోజుల్లో అన్ని రకాల పనులను పూర్తి చేయాలని డీఈఓ ఆదేశించారు. అనంతరం పలు అంశాలపై సమీక్షించారు. ఈ సమావేశంలో డీవైఈఓ ఎస్.వెంకటేశ్వరరావు, డీసీఈబీ కార్యదర్శి ఎం.వెంకట్రావు, డీఈ నాగేంద్ర, ఎంఈఓలు చౌదరి, శర్మ, ఆయా మండలాల ఎంఈఓలు, హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

తుని: విద్యుత లైన్ల నిర్వహణలో భాగంగా పట్టణంలోని పలు ప్రాంతాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ట్రాన్స్‌కో ఈఈ కె.రత్నాలరావు గురువారం ప్రకటనలో తెలిపారు. వీరవరపుపేట 33/11 కేవీ సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ లైన్లపై చెట్ల కొమ్మల తొలగింపు కారణంగా బ్యాంకుకాలనీ, కొత్తపేట, కోర్టువీధి, బత్తాయితోట, రెడ్ కాన్వెంట్, దుర్గాదాస్ వీధి, సమితి ఆఫీసు, పార్కు సెంటర్, సినిమా రోడ్డు తదితర ప్రాంతాల్లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. ప్రజలు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకుని సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

జగ్గంపేట: విద్యుత్ లైన్ల మరమ్మత్తులు, వైర్లపై ఉన్న చెట్ల కొమ్మల తొలగింపు కారణంగా శుక్రవారం మండలంలోని పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని స్థానిక ట్రాన్స్ కో డీఈ రత్నాలరావు గురువారం తెలిపారు. ఇండస్ట్రియల్ ఫీడర్ పరిధిలోని బాలాజీ నగర్, టవర్ కాలనీ, గుర్రంపాలెం, గొల్లలగుంట, మల్లిపాక గ్రామాల్లో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ విద్యుత్ సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు విషయాన్ని గమనించి సహకరించాలని కోరారు.

డిప్యుటేషన్లు రద్దు చేయండి

తుని: పురపాలక శాఖలో డిప్యుటేషన్లను రద్దు చేసి మున్సిపల్ ఉద్యోగులకు న్యాయం చేయాలని ఏపీ మున్సిపల్ మినిస్టీరియల్ ఎంప్లాయీస్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు కె.శివాజీ విజ్ఞప్తి చేశారు. పురపాలక సంఘంలోని మున్సిపల్ ఉద్యోగులతో గురువారం ఆయన పలు అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇతర ప్రభుత్వ శాఖల నుంచి కొంతమంది ఉద్యోగులు డిప్యుటేషన్‌పై మున్సిపల్ శాఖకు రావడం వల్ల మున్సిపల్ ఉద్యోగులకు ప్రమోషన్లు రాకుండా అన్యాయం జరుగుతోందన్నారు. పైరవీలు ద్వారా వచ్చిన అధికారుల వల్ల ఏళ్ల తరబడి పని చేస్తున్న మున్సిపల్ ఉద్యోగులు గుమస్తాలుగానే ఉద్యోగ విరమణ చేయాల్సిన దుస్థితి నెలకొంటుందని ఆవేదన వ్యక్తం చేశారు. పలువురు మున్సిపల్ ఉద్యోగులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ జనాభా దినోత్సవం



గండేపల్లిలో ర్యాలీ చేస్తున్న వైద్య సిబ్బంది

గండేపల్లి: తాత్కాలిక, శాశ్వత కుటుంబ నియంత్రణ పద్ధతులు పాటించడం ద్వారా జనాభాను తగ్గించవచ్చని గండేపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి కేవీ నరేష్ తెలిపారు. మండలంలో గురువారం ప్రపంచ జనాభా నివారణ దినోత్సవం నిర్వహించారు. తల్లీబిడ్డా శ్రేయస్సుకు సరైన సమయంలో గర్భధారణ, బిడ్డకు–బిడ్డకు మధ్య అంతరం అనే థీమ్, కుటుంబ ప్రణాళిక అనే నినాదాలతో గండేపల్లిలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లీబిడ్డా ఆరోగ్యంగా ఉండాలంటే బాల్య వివాహాలను నివారించాలన్నారు. రోజురోజుకూ పెరుగుతున్న జనాభాను నియంత్రించాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి సురేంద్ర, సూపర్‌వైజర్ చెల్లారావు తదితరులు పాల్గొన్నారు.

చిరుధాన్యాల సాగుపై అవగాహన



యర్రంపాలెంలో చిరుధాన్యాల సాగుపై అవగాహన కల్పిస్తున్న ఏఓ సుధీర్ కుమార్

గండేపల్లి: చిరుధాన్యాల సాగుకు నీరు నిల్వ లేని తేలికపాటి నేలలు అనుకూలమని పెద్దాపురం వ్యవసాయ పరిశోధన కేంద్రం శాస్త్రవేత్త కె.సుధీర్ కుమార్ అన్నారు. మండలంలోని పి.నాయకంపల్లి, యర్రంపాలెం గ్రామాల్లో రైతులకు గురువారం చిరుధాన్యాల సాగుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు మేలైన యాజమాన్య పద్ధతులు పాటించడం ద్వారా ఎకరాకు 8 నుంచి 10 క్వింటాళ్ల దిగుబడి సాధించవచ్చన్నారు. అన్నదాతలు చిరుధాన్యాల సాగుపై దృష్టి సారించాలని ఆయన సూచించారు.

బాధితులకు పరామర్శ

తొండంగి: మండలంలోని వేమవరంలో ప్రమాదానికి గురై గాయపడిన వైఎస్సార్ సీపీ నాయకుడు నేమాల కొండబాబును ఆ పార్టీ నాయకుడు యనమల కృష్ణుడు గురువారం పరామర్శించారు. కొద్ది రోజుల క్రితం కొండబాబు ఆటో ప్రమాదానికి గురై గాయాపాలయ్యాడు. ఈ నేపథ్యంలో యనమల కృష్ణుడు పార్టీ నాయకులతో కలిసి పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఇదే గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు తాటిపర్తి లోవరాజు కొద్ది రోజుల క్రితం మరణించగా వారి కుటుంబ సభ్యులను కృష్ణుడు పరామర్శించారు. కార్యక్రమంలో వేమవరం సర్పంచ్ మారేటి కృష్ణ,యాదాల ప్రసాద్, కోడా బాబ్జి, మడదా దండు, పేకేటి హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.